

పలు రైళ్లు రద్దు

కాజీపేట–బల్లార్షా, విజయవాడ, సికింద్రాబాద్ మార్గంలో మూడో రైల్వే లైన్, ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో పలు రైళ్లు రద్దు అయ్యాయి. - 8లో▸



జలపాతాల కనువిందు

వరుసగా కురుస్తున్న వర్షాలతో ములుగు జిల్లాలోని ముత్యంధార, బొగత, దూసపాటి లొద్ది జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $28^0/24^0$

జిల్లాలో ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పౌర సేవలు అందుబాటులోకి తేవాలి



పర్వతగిరి: పంచాయతీ కార్యదర్శులు పౌర సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని డీఎల్‌పీఓ ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో పర్వతగిరి, సంగెం మండలాల పంచాయతీ కార్యదర్శులకు శనివారం పౌర సేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్స్, మ్యూటేషన్స్ ఆన్‌లైన్ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, పర్వతగిరి ఎంపీఓ పాక శ్రీనివాస్,సంగెం ఎంపీఓ కొమురయ్య, డీపీఎం దివ్య, పర్వతగిరి, సంగెం మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

20న రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

పర్వతగిరి: తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ పుట్టిన రోజు, జాతీయస్థాయి ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా ఈనెల 20న రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు గోశాల సమాఖ్య అధ్యక్షుడు జి.రాజేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివశక్తి గోశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ అంశంపై తెలుగులో వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంట్రీల సంఖ్య ఆధారంగా విద్యార్థులు, పాఠశాలలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. వివరాలకు 93940056 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు వర్ధన్నపేటలో విద్యుత్ అంతరాయం

వర్ధన్నపేట: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం వర్ధన్నపేట పట్టణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ ప్రశాంత్ శనివారం తెలిపారు. నూతనంగా లైన్లు వేయనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏడీ కోరారు.

18న ప్రవేశ పరీక్ష

సంగెం: గవిచర్ల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముజుబుర్‌రహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగెం మండల పరిధిలోని వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు ఆధార్‌కార్డు తీసుకుని మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్న పరీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలి

పర్వతగిరి: విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ వేణుగోపాలచారి కోరారు. ఏనుగల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి 15 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఓవర్ లోడ్ నాలుగు, బిల్డింగ్ పై నుంచి లైన్లు తొలగించుట 5, షిఫ్టింగ్ మూడు, విద్యుత్ అక్రమ వినియోగంపై మూడు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. అక్రమ విద్యుత్ వినియోగం ఫిర్యాదులను తొలగించి 12 ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సభ్యులు తిరుమల్‌రావు, చరణ్‌దాస్, నరేందర్, ఎస్ఈ మధుసూదన్‌రావు, డీబీఎం భిక్షపతి, ఏఓ చంద్రమౌళి, ఏఈ రవి, వినియోగదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సిరి.. అరుణగిరి!



సండే స్పెషల్

ప్రతీ పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షిణ

- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీగా తరలుతున్న భక్తులు
- ప్రత్యేక రైలు, ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులు
- ప్రవచనకర్తలతో మరింత ప్రాచుర్యం

ఆకాశాన చీకటి తొలగింది. అందమైన పున్నమి వెలిగింది. అరుణగిరిపై వెండివెలుగు పండింది. ఆధ్యాత్మిక సిరి భక్తుల్లో నిండింది. కాళ్లు కొండను కొలిచాయి. నోళ్లు శివుడిని స్మరించాయి. చేతులు జోడీ కట్టి దండం పెట్టాయి. అష్టదిక్పాలకులు ఆశీర్వదించగా.. గర్భాలయంలో అరుణాచల శివుడు దర్శనమిచ్చాడు. అరుణాచల యాత్ర.. ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న నయాట్రెండ్. ప్రతి పౌర్ణమికి ఇక్కడినుంచి చిన్నాపెద్దా తేడాలేకుండా పెద్దఎత్తున తరలివెళ్తున్నారు. యాత్ర ప్రత్యేకతలు, కొత్తగా వచ్చిన భక్తిభావంపై 'సాక్షి' ఈ వారం అందిస్తున్న సండే స్పెషల్ స్టోరీ..

\- జనగామ

ఒకప్పుడు తీర్థయాత్రలంటే ఓ వయసు దాటిన వాళ్లు మాత్రమే వెళ్లేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. యూత్ ఎక్కువగా దైవ దర్శనాలకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఏడాది కాలంగా అరుణాచల పుణ్యక్షేత్రం.. గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇటీవలి కాలంలో పలువురు ప్రవచనకర్తలు వారి ప్రవచనాల్లో ఎక్కువగా అరుణాచల ప్రాముఖ్యాన్ని ప్రస్తావించడంతో అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య పెరిగిపోయింది.

గిరి ప్రదక్షిణ ప్రత్యేకం

అరుణాచల యాత్రలో గిరి ప్రదక్షిణ ప్రత్యేకం. కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం ద్వారా అనంత శక్తి మనసులోకి ప్రవేశిస్తుందని మఠాధిపతులు, పీఠాధిపతులు చెబుతున్నారు. అరుణాచల కొండ నాలుగైదు ఉప శిఖర కోణాలతో ఏక ముఖ్య శిఖరముఖంతో 14 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. గిరి చుట్టూ పరిక్రమణలో అష్టదిక్పాలకులైన ఇంద్ర, అగ్ని, యమ, నైరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశాన్య పేర్లతో 8 లింగాలతో ఆలయాలు దర్శనమిస్తాయి. వీటిని అష్టలింగాలు అని పిలుస్తారు. ఆలయాలన్నీ చంద్ర గుర్తులు, రాశులతో సంబంధం కలిగి ఉంటాయి. ప్రదక్షిణ మధ్యలో మోక్ష మార్గం వస్తుంది. ఇందులో నుంచి దాటితే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. అరుణగిరి కొండపై సాధువులుంటారని భక్తులు బాగా విశ్వసిస్తారు.



గిరి ప్రదక్షిణలో జనగామకు చెందిన భక్తులు



అరుణాచల క్షేత్రం

అరుణాచలంలోని రమణ మహర్షి ఆశ్రమం, టోపీ అమ్మవారి మహత్యాలు సైతం ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కోరిన కోర్కెలు తీరుతాయని, సిరి సంపదలు సిద్ధిస్తాయని అరుణాచల శివుడి దర్శనానికి వెళ్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా భక్తులు చెబుతున్నారు.

ప్రత్యేక రైళ్లు...

వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచలం క్షేత్రానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాట్పాడి స్టేషన్ వరకు ప్రతీరోజు నాలుగు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ ఆదివారం డైరెక్ట్‌గా అరుణాచల క్షేత్రానికి రైలు ఉంది. ప్రతీనెల పౌర్ణమి రోజున హైదరాబాద్, ఉత్తరాంధ్ర నుంచి అరుణాచలానికి ప్రత్యేక రైళ్లను నడిపిస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

ప్రతినెలా పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం క్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈనెల 25వ తేదీ నుంచి ఆర్టీసీ ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 31న హనుమకొండ నుంచి రెండు బస్సులు బయల్దేరుతాయి. కాగా.. హైదరాబాద్ ఉప్పల్‌క్రాస్ రోడ్ నుంచి కూడా బస్సులు అందుబాటులో ఉంటాయి.



అరుణాచల యాత్రలో ఉమ్మడి జిల్లా భక్తులు

వచ్చే నెల పౌర్ణమి

2023 ఆగస్టు 1వ తేదీ తెల్లవారుజామున 3.51 గంటలకు పౌర్ణమి ఘడియలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు 2వ తేదీ మధ్యాహ్నం 12.01 గంటలకు ముగుస్తాయి.

ప్రతినెలా బస్సు



అరుణాచలానికి ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక బస్సులకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. గత పౌర్ణమికి మొదటిసారి బస్సు నడిపాం. ముందుగా ఒక్క బస్సు నడుపుదామని ప్లాన్ చేశాం. అనూహ్యంగా రెండు బస్సులకు సరిపడా భక్తులు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారు. మహిళల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.

\- జాస్తి శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం

గిరి ప్రదక్షిణతో మహాపుణ్యం



అరుణాచలంలో గిరి ప్రదక్షిణ 14 కిలో మీటర్లు ఉంటుంది. ఒక్కసారి అరుణాచల గిరి ప్రదక్షిణ చేస్తే కాశీకి వెయ్యి సార్లు వెళ్లిన పుణ్యం వస్తుంది. అరుణాచలంలో అగ్ని లింగం ఉంటుంది. పంచ భూత లింగాల్లో అగ్ని లింగం ఒకటి. ప్రతీ భక్తుడు తప్పనిసరిగా అరుణాచల గిరిప్రదక్షిణ చేస్తే ఎంతో మేలు కలుగుతుంది.

\- నాగమల్ల నరేశ్, మహబూబాబాద్

మరిచిపోలేని అనుభూతి..



నేను నా భర్త గత మేలో గిరిప్రదక్షిణ చేశాం. నాకు చాలా బాగా అనిపించింది. ఎంతో మహిమ గల దేవుడు అని నాకు నమ్మకం కలిగింది. మండుటెండలో నడవలేరని, 14కిలో మీటర్లు ప్రదక్షిణ చేయడం సాధ్యం కాదని అందరూ అన్నారు. ముందుగా దర్శనం అయిన తర్వాత వర్షం ప్రారంభమైంది. సన్నటి జల్లులో గిరిప్రదక్షిణ చేశాం. మరిచిపోలేని అనుభూతి పొందాను.

\- బొల్లోజు సుధారాణి, కాశిబుగ్గ, వరంగల్

తప్పక చూడాల్సిన పుణ్యక్షేత్రం



చిన్నప్పటి నుంచి ఒక్కసారైనా అరుణాచల యాత్రకు వెళ్లాలనుకున్నా. చాగంటి ప్రవచనాలతో మరింత గట్టిగా నిర్ణయించుకున్నా. ఇటీవల అరుణాచలానికి వెళ్లి వచ్చా. వయసురీత్యా గిరి ప్రదక్షిణ చేయలేనని అనుకున్నా. కానీ ఆదేవుడే నన్ను నడిపించాడు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో చూడాల్సిన పవిత్ర పుణ్యక్షేత్రం.

\- పుల్లూరి శ్రీహరి, రిటైర్డ్ తహసీల్దార్

వచ్చే నెల మళ్లీ వెళ్తున్నా..



అరుణాచలం వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలంగా భావిస్తున్నా. ఎనిమిది జ్యోతిర్లింగాలను దర్శించుకోవడం, కనులారా స్వామిని చూసే భాగ్యం కలగడం ఎంతో పుణ్యం. దైవం ఉన్నాడు అనడానికి లక్షలాదిగా తరలి వస్తున్న భక్తజనమే సాక్ష్యం. గత నెల వెళ్లాను.. వచ్చే నెల వెళ్లడానికి మరోసారి పయనమవుతున్నా. ఆర్టీసీ మరిన్ని బస్సులు పెంచాలి. ప్రచారం కల్పించాలి.

\- కొండపల్లి శిరీష, విద్యార్థిని, జనగామ

సెలక్షన్ లొల్లి..!

అధికార పార్టీకి బీసీల ఆర్థిక సాయం సెగ

- లబ్ధిదారుల ఎంపికలో నేతల మధ్య విభేదాలు
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే గొడవ
- చెన్నారావుపేట మండల నాయకుల ఘర్షణ
- ఎంపీపీని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్
- ఇన్‌చార్జ్ ఆర్డీఓకు అవిశ్వాస తీర్మానం నోటీస్ అందించిన ఎంపీటీసీలు

నర్సంపేట: బీసీ కులవృత్తులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వివాదాలకు దారితీస్తోంది. నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండల అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే గొడవ జరగడంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కొంతమందిని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. చెన్నారావుపేట ఎంపీపీ బాదావత్ విజేందర్‌తోపాటు మరో నాయకుడిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ మండల కన్వీనర్‌తోపాటు మిగిలిన నాయకులు ఏకంగా విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. 8 మంది ఎంపీటీసీలు ఎంపీపీ విజేందర్‌పై అవిశ్వాస తీర్మాన నోటీస్‌ను నర్సంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ మహేందర్‌జీకి కూడా ఇచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి అమలవుతున్న ఈ పథకం అంతర్గత పోరుకు దారి తీయడం అధికార పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది.

ఇద్దరు నాయకులు పేర్లు సూచించడంతోనే..

బీసీ వర్గాల్లో 15 కులాలకు చెందిన వారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందించాలని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ మేరకు బీసీ వర్గాల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాలో 11, 296 మంది లబ్ధి కోసం అర్జీలు పెట్టుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యేకు ఉండడంతో తొలి విడత నియోజకవర్గానికి 300 మందికి పంపిణీ చేయాలని నిర్ణయించింది. అర్హులను ప్రకటించే ప్రక్రియలో భాగంగా అధికార పార్టీ నేతల్లో విభేదాలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలోనే చెన్నారావుపేట మండలంలో ఇద్దరు నేతలు ఎవరికి వారే పేర్లు సూచించే క్రమంలో ఘర్షణ జరిగింది.



ఎంపీపీ విజేందర్‌పై నర్సంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓకు అవిశ్వాస తీర్మానం నోటీస్ అందజేస్తున్న ఎంపీటీసీలు

ఎంపీపీపై అవిశ్వాసం..

ఈ వివాదం ఏకంగా చెన్నారావుపేట ఎంపీపీ బాదావత్ విజేందర్‌పై అవిశ్వాస తీర్మానానికి దారి తీసింది. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీపీ విజేందర్ ఒక జాబితా ఇవ్వగా.. అదే గ్రామానికి చెందిన మరి కొందరి పేర్లను మరో అధికార పార్టీ నాయకుడు ఇచ్చారు. వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి ఎంపీపీ విజేందర్ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేయగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికార పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నుంచి విజేందర్‌ను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యేను కోరడం, 8 మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఆర్డీఓకు అందజేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి వివాదాలు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయోనని అధికార పార్టీలో చర్చ మొదలైంది.

కమిటీల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి

- జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

గీసుకొండ: గ్రామపంచాయతీ కమిటీల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి అన్నారు. ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లా రామచంద్రాపురం మండల కేంద్రంలోని జీఎంజీ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ నిర్మల ఆధ్వర్యంలో ప్రోగ్రాం మేనేజర్లు, ఆఫీసర్లు, కమ్యూనిటీ ఎడ్యుకేటర్లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ గంగదేవిపల్లి గ్రామపంచాయతీగా ఏర్పడిన తర్వాత మొదటి, రెండు విడతల్లో పాలకవర్గాలను మొత్తం మహిళలనే ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇంటింటికీ మరుగుదొడ్డి, ఇద్దరు సంతానంతో కుటుంబ నియంత్రణ తదితర అంశాలతో ఆదర్శ గ్రామంగా ఎంపికైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.



గ్రామ అభివృద్ధి గురించి వివరిస్తున్న రాజమౌళి

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 138 మంది లబ్ధిదారులకు రూ.37.53 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పోడు భూములకు శాశ్వత హక్కులు

పోడు భూములకు శాశ్వత హక్కు పత్రాలు సీఎం కేసీఆర్ తోనే సాధ్యమయ్యాయని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండా, ఆకులతండా,ఏనుగల్‌తండా, ఇటుకాలపల్లి, నర్సింగాపురం, కొండసముద్రంతండా, లైన్‌తండా గ్రామపంచాయతీలకు సంబంధించిన 120 మంది లబ్ధిదారులకు 203 ఎకరాలకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పోడు భూములకు రైతుబంధు, రైతుబీమా వర్తిస్తాయన్నారు. భూములకు రేట్లు అమాంతం పెరుగనున్నాయన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వెయ్యి మంది రైతులతో సమావేశాలు

నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని రైతువేదికల్లో ఈనెల 17వ తేదీ నుంచి 10 రోజుల పాటు వెయ్యి మంది రైతులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎకరానికి గంట విద్యుత్ చాలు అనే కాంగ్రెస్ పార్టీ కావాలా.. 24 గంటల విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ పార్టీ కావాలా అని ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొన్న కష్టాలను కళ్లకు కట్టినట్లు వివరించాలని కోరారు.

శునకానికి సమాధి..

- సంప్రదాయబద్ధంగా దశదిన కర్మ
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


శునకానికి దశదినకర్మ చేస్తున్న వీరన్న కుటుంబీకులు

కేసముద్రం: ఎంతో ప్రేమతో పెంచుకున్న శునకం ఇటీవల అనారోగ్యంతో చనిపోగా అంత్యక్రియలు చేశారు. ఆ పెంపుడు కుక్క జ్ఞాపకాలను మరువలేక, దానికి సమాధి కట్టి, సంప్రదాయబద్ధంగా దశదినకర్మలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఆసక్తికరమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రాచర్ల వీరన్న, మంజుల దంపతులు ఆరేళ్ల క్రితం ఓ చోట నుంచి శునకాన్ని తీసుకువచ్చారు. ఆ శునకానికి జాకీ అని పేరు పెట్టారు. అది ఇంట్లో మనిషిలో పెరిగింది. ఈ క్రమంలో ఈనెల 5న ఆ శునకం అనారోగ్యంతో చనిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించి, ఊరి చివరన శునకాన్ని ఖననం చేశారు. ఆరోజు నుంచి మనిషి చనిపోతే ఏవిధంగా కార్యక్రమాలు చేస్తారో, అదే రీతిలో మృతిచెందిన శునకానికి వీరన్న కుటుంబ సభ్యులు కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. చివరకు పెంపుడు కుక్క జ్ఞాపకాలను మరువలేక ఖననం చేసిన చోట సమాధి కట్టించారు. సమాధిపై జాకీ పేరుతోపాటు, దాని చిత్రాన్ని వేయించారు. 11వ రోజైన శనివారం బంధుమిత్రులను పిలిచి, సంప్రదాయబద్ధంగా సమాధి వద్ద దశదినకర్మలు చేశారు. అనంతరం వచ్చిన వారందరికి భోజనాలు పెట్టారు.

ఒయాసిస్ స్కూల్‌కు అంతర్జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న జేఎస్ పరంజ్యోతి

వరంగల్: దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్ విద్యా బోధనలో అంతర్జాతీయ అవార్డును అందుకుంది. లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్, టీచర్స్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉత్తమ పాఠశాల కోసం అంతర్జాతీయంగా ఈఅవార్డును అందిస్తుంది. జాతీయ స్థాయిలో ఇన్నోవేటివ్ స్కిల్ విద్యను అందించినందుకుగాను ఒయాసిస్ పబ్లిక్ స్కూల్ ఈ అవార్డుకు ఎంపికైంది. జూలై 2నుంచి 9వ తేదీ వరకు కేంబ్రిడ్జ్, నిసా (నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్) వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ ముగింపు శనివారం జరిగింది. ఈసందర్భంగా కేంబ్రిడ్జ్‌లోని ఫిట్జ్‌విలియం కళాశాలలో ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ జేఎస్ పరంజ్యోతి అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్లు గైడోజా, ఫెర్నాండెజ్, నిసా ప్రెసిడెంట్ కులభూషణ్‌శర్మ, సీఈఓ పాపయ్య, డొమినోస్‌లు పాల్గొన్నారు.

జలపాతాల కనువిందు

వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని ముత్యంధార, బొగత, దూసపాటి లొద్ది జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. పాలనురుగులతో జాలువారుతున్న జలపాతాల సవ్వడులు కనువిందు చేస్తున్నాయి. వీటిని చూసేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం జిల్లాలతో పాటు తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వేలాదిగా తరలివచ్చి సేద తీరుతున్నారు. పర్యాటకుల సందడితో జిల్లా కేంద్రంతో పాటు గోవిందరావుపేట, పస్రా, ఎస్‌ఎస్ తాడ్వాయి, ఏటూరు నాగారం, వాజేడు, వెంకటాపురం(కె) ప్రాంతాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పర్యాటకులను ఇట్టే ఆకట్టుకుంటూ జాలువారుతున్న జలపాతాలపై ఈ వారం సండే స్పెషల్.. ములుగు

జాలువారుతున్న ముత్యంధార, బొగత, దూసపాటి లొద్ది

- అనుకూలంగా కురుస్తున్న వర్షాలతో జలకళ
- రోజురోజుకూ పెరుగుతున్న పర్యాటకులు

ఏర్పాట్లు చేస్తున్నాం..




బొగత జలపాతం వద్ద గత సంవత్సరం భారీగా కురిసిన వర్షాలతో జలపాతంలోకి పర్యాటకులు దిగకుండా ఏర్పాట్లు చేసినా మెస్ పూర్తిగా పాడైంది. ఈ సారి అదే సమస్య ఎదురుకాకుండా ఐరన్‌తో ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా ఆర్‌సీసీ ప్రొటక్షన్ వాల్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తి చేస్తాం. పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా మెయిన్ గేట్ నుంచి జలపాతం వరకు సహాయకులను అందుబాటులో ఉంచుతున్నాం. - చంద్రమౌళి, ఎఫ్‌ఆర్‌ఓ


పాలనురుగులతో పొంగుతున్న బొగత జలపాతం

మరపురాని బొగత..

వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతానికి చేరుకోవాలంటే హనుమకొండ నుంచి ములుగు జిల్లా కేంద్రం మీదుగా ఏటూరునాగారం రావాలి. అక్కడి నుంచి వాజేడు మండలం జగన్నాధపురం వై జంక్షన్ చేరుకోవాలి. అక్కడి నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలోని బొగత జలపాతానికి చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో జలపాతం నుంచి పారుతున్న నీటిలో స్నానాలకు అనుమతినిచ్చిన అధికారులు.. నీటి ప్రవాహంతో ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో ఫెన్సింగ్ వేశారు. జలపాతం పరిసరాల్లో చిన్నారులు ఆడుకోవడానికి జారుడు బల్ల, ఉయ్యాల వంటివి ఏర్పాటు చేశారు. బొగత అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వాచ్ టవర్లను సిద్ధం చేశారు. బొగత జలపాతం చూసిన వారికి మరుపురాని జ్ఞాపకంగా ఉంటుంది.

మైతాపురం జలపాతం అద్భుతం




వెంకటాపురం(కె) మండలంలో మరో జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రం నుంచి సుమారు 10 కిలో మీటర్ల దూరంలోని మైతాపురం సమీపంలోని జలపాతం కొండ కొనల నుంచి జాలువారుతున్న జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దట్టమైన అటవీ ప్రాంతంలో పచ్చని అందాల మధ్య చూడ ముచ్చటగా ఉన్న జలపాతం కనువిందు చేస్తోంది. ఇటీవల ఈ ప్రాంతానికి వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని ప్రచార మాధ్యమాల్లో విస్తృతం చేశారు.

ప్రకృతి అందాల నడుమ దూసపాటి లొద్ది..



వాజేడు మండలంలోని మరో జలపాతం దూసపాటిలొద్ది జలపాతం. ఇక్కడకు చేరుకోవాలంటే ఏటూరునాగారం దాటి జగన్నాధపురం వై జంక్షన్ మీదుగా రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొంగాల గ్రామానికి చేరుకోవాలి. అక్కడ నుంచి 5 కిలో మీటర్ల దూరం అటవీ ప్రాంతంలో కాలినడకన వెళ్తే జలపాతానికి చేరుకుంటారు. ప్రకృతి అందాల నడుమ జాలువారే జలపాతం అందాలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఒకసారి చూసిన సందర్శకులు మళ్లీ చూడాలనే ఉత్సాహం కలుగుతుంది.

700 అడుగులు.. ముత్యంధార



వెంకటాపురం (కె) మండల పరిధిలోని ముత్యంధార జలపాతానికి చేరుకోవడానికి వరంగల్ నుంచి ములుగు జిల్లా కేంద్రం మీదుగా ఏటూరునాగారం రావాలి. అక్కడ నుంచి జగన్నాధపురం వైజంక్షన్ మీదుగా వెంకటాపురం మండల కేంద్రానికి చేరుకోవాలి. మండల కేంద్రం నుంచి 11 కిలో మీటర్లు దూరంలో ఉన్న వీరభద్రవరం గ్రామానికి చేరుకొని అటవీ మార్గంలో సుమారు 9 కిలో మీటర్లు కాలినడకన ప్రయాణిస్తే ముత్యం ధార జలపాతానికి చేరుకుంటారు. సుమారు 700 అడుగుల నుంచి జాలువారుతున్న ముత్యంధార విస్మయానికి గురిచేస్తుంది. పర్యాటకులకు ఎనలేని అనుభూతినిస్తుంది.

పలు రైళ్లు రద్దు

- ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు 11..
- 17నుంచి 24వ తేదీ వరకు 3 రైళ్లు రద్దు



కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కాజీపేట–బల్లార్షా, విజయవాడ, సికింద్రాబాద్ మార్గంలో మూడో రైల్వే లైన్, ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేపట్టిన రోలింగ్ బ్లాక్ కారిడార్‌తో పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు అయ్యాయి. ఈ రద్దును ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట–డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్–కాజీపేట (07754) ప్యాసింజర్, కాజీపేట–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17003) ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17004) ప్యాసింజర్, భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి, సిర్పూర్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–హైదరాబాద్ (07463) పుష్‌పుల్, సిర్పూర్–కరీంనగర్ (07766) పుష్‌పుల్, కాజీపేట–బల్లార్షా (17035) రామగిరి ప్యాసింజర్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్ వరకు, ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి, కరీంనగర్–సిర్పూర్ (07765) పుష్‌పుల్, బల్లార్షా–కాజీపేట (17036) ప్యాసింజర్ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రద్దును ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

డోర్నకల్: కాజీపేట–విజయవాడ మధ్య రైళ్ల రద్దును మరోసారి పొడగించారు. సికింద్రాబాద్ డివిజన్‌లో రోలింగ్ కారిడార్ బ్లాక్ పనులు కొనసాగుతుండటంతో గత రెండు నెలలుగా పలు రైళ్లను రద్దు చేశారు. మరోసారి సోమవారం నుంచి 23వ తేదీ వరకు పలు రైళ్లు రద్దయ్యాయి. కాజీపేట–డోర్నకల్(07753), డోర్నకల్–కాజీపేట(07754), డోర్నకల్–విజయవాడ(07755), విజయవాడ–డోర్నకల్(07756), భద్రాచలం రోడ్–విజయవాడ(07278), విజయవాడ–భద్రాచలం రోడ్(07979), భద్రాచలం రోడ్–బలార్షా(17033), సిర్పూర్ టౌన్–భద్రాచలం రోడ్(17034) రైళ్లు ఈ నెల 23 వరకు రద్దు కానున్నాయి.

పోలీస్ అధికారుల బదిలీ



ఖిలా వరంగల్: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 8 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి డీజీపీ అంజన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీస్‌శాఖలో రోజుకో విభాగం అధికారులను బదిలీ చేస్తున్నారు. రెండు, మూడు రోజులుగా ఎస్‌ఐలు, సీఐల బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. తాజాగా శనివారం డీఎస్పీలు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో భూపాలపల్లి డీసీఆర్‌బీ నుంచి డీఎస్పీ ఇ. కిశోర్‌కుమార్ పరకాల ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇంతకాలం పరకాలలో ఏసీపీగా పనిచేసిన జే. శివరామయ్య ఛీఫ్ ఆఫీస్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా కామారెడ్డి ఏసీపీగా పనిచేసిన వీ. సురేశ్ మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌కు బదిలీ అయ్యారు. ఇంతకాలం తొర్రూర్ డీఎస్పీగా పనిచేసిన ఎ. రఘు ఛీఫ్ ఆఫీస్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న ఏసీపీ సతీశ్ బాబు.. మామునూరు ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇంత కాలం మామునూరులో పనిచేసిన టి. కృపాకర్ ఛీఫ్ ఆఫీస్ హైదరాబాద్‌కు బదిలీఅయ్యారు. సీసీఎస్ వరంగల్ ఏసీపీగా పనిచేసిన పీ. డేవిడ్ రాజు కాజీపేట ఏసీపీగా బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రూరల్ ఏసీపీగా పనిచేసిన ఎం.భోజరాజు ఎస్‌బీ సెక్యూరిటీ వరంగల్ బదిలీకు అయ్యారు.

రూపాయి బిల్ల, బాయిల బంగారం

- డబుల్‌మీనింగ్ మాటలతో ఉపాధ్యాయుల వెకిలి చేష్టలు
- చదువుమీద దృష్టిపెట్టలేక పోతున్నామంటూ విద్యార్థినుల లేఖలు


పాఠశాలలో సమస్యలు, ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థుల లేఖ

జనగామ రూరల్: రూపాయి బిల్ల, బాయిల బంగారం, రొట్టె, మేక పిల్ల.. ఇవేమిటి అనుకుంటున్నారా.. ఓ ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినులనుద్దేశించి చేస్తున్న డబుల్ మీనింగ్ మాటలు. వారి వెకిలిచేష్టలతో విసిగిపోయిన వారు.. లేఖలతో తమ ఆవేదనను విద్యార్థి సంఘాల నాయకులకు తెలిపారు. ఈ ఘటన జనగామ మండలం చౌడారం మోడల్‌స్కూల్‌లో శనివారం చోటుచేసుకుంది. చౌడారం మోడల్ స్కూల్‌లో ఇంటర్ వరకు బాలికల వసతి గృహం ఉంది. మొత్తం 500 వరకు విద్యార్థులు ఉండగా.. ఇంటర్‌లో 100 మంది బాలికలున్నారు. పీజీటీ సోషల్ టీచర్ సాగర్, టీజీటీ హిందీ టీచర్ కృష్ణానాయక్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులు తమ వెకిలి మాటలతో ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థినులు తెలిపారు. కృష్ణానాయక్ రెండు నెలల క్రితం ఓ బాలిక విషయంలో అనుచితంగా ప్రవర్తిస్తే విద్యార్థులు ఫిర్యాదు చేయగా ప్రిన్సిపాల్ మందలించినట్లు తెలిసింది. అయినా మార్పు రాకపోవడంతో విసుగు చెందిన విద్యార్థినులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను లేఖ రూపంలో విద్యార్థి సంఘాల నాయకులకు శనివారం తెలియజేశారు. డీఈఓ, కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

విషయం తెలిసింది : డీఈఓ

ఈ విషయమై డీఈఓ రామును వివరణ కోరగా.. ఫోన్ ద్వారా విషయం తెలిసిందని, సంబంధిత నోడల్ అధికారితో విచారణ చేయిస్తున్నామని చెప్పారు. ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాధర్‌ను వివరణ అడగ్గా.. ఉపాధ్యాయలపై ఫిర్యాదు అందిందని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం..

- లారీ కింద పడి వ్యక్తి అక్కడికక్కడే మృతి
- చెల్పూరు శివారు కేటీపీపీ వద్ద ఘటన


సత్యనారాయణ (ఫైల్)

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు శివారు కేటీపీపీ వద్ద 35 జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. చెల్పూరు జీపీ పరిధి వీరయ్యపల్లి గ్రామానికి చెందిన మోగులోజు సత్యనారాయణ (35) చెల్పూరు కేటీపీపీలోని డీఏవీ స్కూల్లో స్కూల్ బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం విధులు నిర్వహించిన అనంతరం ఇంటికి వెళ్లి భోజనం చేసి తిరిగి కేటీపీపీలోకి వెళ్లే క్రమంలో ప్రధాన గేట్ వద్ద తన ద్విచక్రవాహనం నిలిపి అక్కడే నిల్చున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి నుంచి పరకాల వైపునకు వస్తున్న బొగ్గు లారీ.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో సత్యనారాయణ లారీ వెనుక టైరు కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని సత్యనారాయణ మృతదేహం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న గణపురం పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని లారీ కింది నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు బస్సు క్లీనర్‌గా పని చేస్తుండడంతో పాటు కేటీపీపీలోనే వడ్రంగి పని కూడా చేస్తున్నాడు. సత్యనారాయణ మృతితో ఆయన గ్రామంతో పాటు కేటీపీపీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య స్వప్న, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గణపురం ఎస్‌ఐ అభినవ్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- కట్ర్యాలలో ఘటన


రాంబాబు(ఫైల్)

వర్ధన్నపేట: రెండేళ్ల క్రితం కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడం.. ఈ ఘటనతో భార్య పుట్టింటికి వెళ్లడం.. కూతురు దూరంగా ఉండి చదువుకోవడం.. ఈ కారణాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కట్ర్యాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కడారి రాంబాబు(41) భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తెతో జీవనం కొనసాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం కుమారుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు మృతి చెందిన తర్వాత భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. కుమార్తె నర్సంపేటలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో కుమారుడు మృతి చెందడం.. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన రాంబాబు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు చూసి వెంటనే కిందకు దింపారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు సోదరుడు కడారి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, దహన సంస్కారాలకు కూడా ఆర్థిక స్థోమత లేక దీనస్థితిని చూసిన ఆస్పత్రి పోస్టుమార్టం విభాగం అసిస్టెంట్ సుదర్శన్.. బాధిత కుటుంబానికి రూ. రెండు వేలు అందించి మానవత్వం చాటుకున్నారు.

షూటింగ్ పోటీల్లో సాయికుమార్‌కు బంగారు పతకం


బంగారు పతకంతో సాయికుమార్

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ ఆకారపుసాయికుమార్ ఇటీవల కేరళలో జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ స్థాయి షూటింగ్ పోటీల్లో 50 మీటర్ల రీఫిల్ ప్రొన్‌లో బంగారు పతకం సాధించారు. దీంతో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా సాయికుమార్ గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన 9వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీల్లో -2023లో కూడా బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన సాయికుమార్‌ను కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కాండూరి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఓంకార్ అభినందించారు.

స్నేహితుడికి సెండాఫ్ ఇచ్చి వస్తూ..

- రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో
- ఇద్దరు స్నేహితుల దుర్మరణం
- కోమళ్ల టోల్‌గేట్ సమీపంలో ఘటన
- హనుమకొండలో విషాదఛాయలు


లారీకిందికి దూసుకెళ్లిన బొలెరో


రాకేశ్‌చంద్రగౌడ్(ఫైల్)

రఘునాథపల్లి/హన్మకొండ: ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్తున్న స్నేహితుడికి ఆనందంగా వీడ్కోలు పలికి తిరిగి వస్తున్న ఆ యువకులు రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లారు. రహదారి పక్కన పార్కింగ్ చేసిన లారీని.. బొలెరో ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు స్నేహితులు రాకేశ్ చంద్ర గౌడ్ (29), సందీప్ (32) అక్కడిక్కడే దుర్మరణం చెందారు. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని కోమళ్ల టోల్‌గేట్ సమీపంలో శనివారం ఉదయం దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం హన్మకొండ గాంధీనగర్‌కు చెందిన వడ్లకొండ నరేందర్, రమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రాజ్‌కుమార్ ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. చిన్న కుమారుడు రాకేశ్ చంద్ర గౌడ్ (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. 2020లో ములుగుకు చెందిన నందినితో వివాహమైంది. వీరికి 9 నెలల బాబు ఉన్నాడు. అలాగే, నయీంనగర్‌కు చెందిన వడ్డెపల్లి ఉపేందర్, అనసూయ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు విజయ్ కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు క్రాంతి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రెండో కుమారుడు సందీప్ (32) బీటెక్ చదివి బిల్డర్‌గా కొనసాగుతున్నాడు. నిజామాబాద్‌కు చెందిన పరిమళతో 2018లో వివాహమైంది. వీరికి 18 నెలల చిన్నారి ఉంది.

లారీ రూపంలో కబళించిన మృత్యువు..

యూఎస్ఏ వెళ్తున్న తమ స్నేహితుడికి సెండాఫ్ ఇచ్చేందుకు రాకేశ్ చంద్ర గౌడ్, సందీప్ శుక్రవారం రాత్రి బొలెరోలో వెళ్లారు. పెంబర్తి రిసార్ట్‌లో స్నేహితుడితో గడిపి శనివారం ఉదయం 5 గంటలకు హన్మకొండకు బయలు దేరారు. కోమళ్ల టోల్‌గేట్ సమీపంలోని మలుపు వద్ద లారీ డ్రైవర్.. నిబంధనలు పాటించకుండా రహదారిపై లారీని నిలిపాడు. ముందు నిలిచి ఉన్న లారీని గుర్తించక బొలెరో ఢీకొంది. దీంతో లారీ కిందికి చొచ్చుకుపోయింది. ఈ ఘటనలో ముందు సీట్లలో కూర్చున్న ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆర్ సంతోష్, ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, స్నేహితులు ఇద్దరు ఒకేసారి మృతి చెందడం.. పైగా ఇద్దరికి రెండేళ్లలోపు చిన్నారులు ఉండడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది. రాకేశ్ గౌడ్ తండ్రి నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్..

వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.ఈ జాతీయ రహదారిపై నిర్ణీత ప్రాంతాల్లోనే వాహనాలు నిలపాలి. ఇందుకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా లారీలు పార్క్ చేస్తున్నారు. కాళేశ్వరం నుంచి ఇసుక తీసుకువచ్చే పదుల సంఖ్యలో లారీలను కోమళ్ల టోల్‌గేట్ సమీపంలో ఇరువైపులా రోడ్డు పక్కన నిలుపుతున్నారు. అదే ఇప్పుడు ప్రమాదానికి కారణమైంది. లారీలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదనే విషయం అనుమానాలకు తావిస్తోంది.